క్లుప్తంగా

విజేతగా లెవెన్ టైగర్స్ జట్టు



కప్ అందజేస్తున్న నాయకులు

కడెం: కేపీకేడీ (కడెం,పెంబి, ఖానాపూర్, దస్తురాబాద్) సీజన్–1 క్రికెట్ టోర్నీ విజేతగా లెవెన్ టైగర్స్ జట్టు నిలిచింది. మండల కేంద్రంలోని మైదానంలో ఈనెల 14న నాలుగు మండలాల ఆటగాళ్లతో టోర్నీ ప్రారంభమైంది. మంగళవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో లెవెన్ టైగర్స్, లెవెన్ వారియర్స్ జట్లు తలపడ్డాయి. ముందుగా ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి టాస్ వేసి మ్యాచ్ ప్రారంభించారు. విజేత జట్టుకు మండలంలోని చిన్నబెల్లాల్‌కు చెందిన సొదాని రమణయాదవ్ రూ.50 వేలు, రన్నరఫ్ జట్టుకు ఉట్నూర్‌కు చెందిన రితేశ్‌రాథోడ్ రూ.25 వేలు అందజేశారు. నాయకులు సతీశ్‌రెడ్డి, మల్లేశ్, శ్రీనివాస్‌లు వారికి ట్రోఫీలు అందజేశారు.

ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న డాక్టర్ సురేశ్

ముథోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగుల వివరాలు, వారికి అందుతున్న చికిత్స గురించి తెలుసుకున్నారు. రోగులకు సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో శుభ్రత పాటించాలన్నారు. అనంతరం పోస్టుమార్టం గదిని పరిశీలించారు. త్వరలో మరమ్మతు చేపట్టి పోస్టుమార్టం జరిగేలా చూస్తామన్నారు. ఆయన వెంట వైద్యులు అనిల్, సాయిసువర్ధన్, రాహుల్, విజేశ్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసారూరల్: భైంసాకు చెందిన సాయినాథ్‌కు సీఎం సహాయ నిధి నుంచి రూ.20 వేల ఆర్థికసాయం మంజూరైంది. ఇందుకు సంబంధించిన చెక్కును మండలంలోని దేగాం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి నివాసంలో మంగళవారం ఆయనకు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు ఆసుపత్రి ఖర్చుల కోసం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా చెక్కు మంజూరైనట్లు తెలిపారు. నాయకులు దత్తురాం, దత్తుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ అందిస్తున్న సభ్యులు

భైంసారూరల్: మండలంలోని తిమ్మాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 26 మంది పదో తరగతి విద్యార్థులకు భైంసాకు చెందిన లయన్స్‌క్లబ్ సభ్యులు మంగళవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. రూ.7 వేల విలువైన స్టడీ మెటీరియల్ అందజేశారు. లయన్స్‌క్లబ్ సభ్యులు డా.ముత్యంరెడ్డి, శివకుమార్, విలాస్ గాదేవార్, శేషరావు, పాఠశాల హెచ్‌ఎం సరితరెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సేవాలాల్ ఉత్సవాలకు నిధులు కేటాయించాలి

కడెం: సేవాలాల్ ఉత్సవాలకు నిధులు కేటాయించాలని బంజారా యువజన సేవా సంఘ రాష్ట్ర నాయకుడు భూక్య రాజేశ్ నాయక్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనర మాట్లాడారు. వచ్చేనెల 15న నిర్వహించే ఉత్సవాలకు, ప్రతి నియోజకవర్గానికి రూ.10 లక్షల చొప్పున ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. బంజారా సేవా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ హపావత్ రాజేందర్, ఉపాధ్యక్షుడు మోహన్ నాయక్, కార్యవర్గ సభ్యులు సోలమాన్ నాయక్, తిరుపతి తదితరులు ఉన్నారు.

వాహనదారులకు అవగాహన

కుంటాల: జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాల్లో భాగంగా మండలంలోని కల్లూరులో ఎస్సై సీహెచ్.భాస్కరాచారి మంగళవారం వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఏఎస్సై జీవన్‌రావు ఉన్నారు.

గ్రామసభలు షురూ..

రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల అర్హుల ఎంపిక కోసం జిల్లాలో మంగళవారం నుంచి పల్లెల్లో గ్రామసభలు ప్రారంభమయ్యాయి. అధికారులు జాబితాల్లోని అర్హుల పేర్లు చదివి వినిపించారు. అనంతరం గ్రామస్తుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కొన్ని గ్రామాల్లో పథకాల ఎంపికలో తమ పేర్లు రాలేదని కొందరు సంబంధిత అధికారులను నిలదీశారు. వారితో వాగ్వాదానికి దిగారు. మరికొన్నిచోట్ల గందరగోళం పరిస్థితి నెలకొంది.

- పథకాల ఎంపిక కోసం నిర్వహణ
- జాబితాల్లో అర్హుల పేర్లు చదివిన అధికారులు
- కొందరు తమ పేర్లు రాలేదని నిలదీత
- వాగ్వాదానికి దిగిన దరఖాస్తుదారులు
- కొన్నిచోట్ల గందరగోళ పరిస్థితి



దస్తురాబాద్: దేవునిగూడెంలో డీఆర్డీవో



లక్ష్మణచాంద: గ్రామసభలో పాల్గొన్న తహసీల్దార్



బాసర మండలం లాబ్డి గ్రామంలో..

కుంటాల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని డీపీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని ఓలా గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ఈనెల 26 నుంచి అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంబకంటి, అంబకంటి తండా, విఠాపూర్ గ్రామాల్లో తహసీల్దార్ ఎజాజ్‌ఖాన్ అహ్మద్ ఖాన్, ఎంపీడీవో లింబాద్రి, డీటీ నరేశ్‌గౌడ్, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, కార్యదర్శులు యోగేశ్, సుమన్, సతీశ్, ఉత్తమ్ పాల్గొన్నారు.

అధికారుల నిలదీత

రుణమాఫీ చేయని గ్రామసభలు ఎందుకని రైతులు అధికారులను నిలదీశారు. ఓలాలో నిర్వహించిన గ్రామసభలో మండిపడ్డారు. ఉపాధి హామీ పథకంలో 20 రోజులు పనిచేసినా కుటుంబాలకు రూ.12 వేలు ఇస్తామన్న విషయం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకునేటప్పుడు ప్రభుత్వం ఎందుకు గోప్యంగా ఉంచిందని ప్రశ్నించారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని డీపీవో శ్రీనివాస్ తెలపడంతో వారు శాంతించారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో తహసీల్దార్ జానకి, చింతల్‌చాందలో డీటీ అబ్దుల్ అజీజ్, వడ్యాల్‌తండాలో ఎంపీడీవో రాధ, తిర్పెల్లిలో ఎంపీవో అమీర్‌ఖాన్, ధర్మారంలో ఏఈ పుష్ప ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించారు. రేషన్ కార్డుల్లో తమ పేర్లు లేవని దరఖాస్తుదారులు మండిపడ్డారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఇది నిరంతర ప్రక్రియ అని ప్రజలెవరూ ఆందోళన చెందవద్దన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. నిర్మల్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఈటెల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, మండల కేంద్రం మాజీ సర్పంచ్ ముత్యంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

భైంసారూరల్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నారు. హజ్గుల్ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ గ్రామసభల్లో పాల్గొని ప్రభుత్వ పథకాల కోసం ఉండాల్సిన అర్హతల గురించి తెలుసుకోవాలన్నారు. లింగా, సిద్దూర్, బోరిగాం, సిరాల, గుండేగాం, బిజ్జూర్ తదితర గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు.

ఖానాపూర్: పట్టణంలోని వార్డు సభలు, మండలంలోని గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో అర్హుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. పట్టణంలోని 12 వార్డులతోపాటు మండలంలోని 25 పంచాయతీల పరిధిలో వెల్లువలా దరఖాస్తులు వచ్చాయి. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, వైస్‌చైర్మన్ సంతోష్, తహసీల్దార్ శివరాజ్, ఎంపీడీవో సునీత, కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు, తదితరులు గ్రామ, వార్డు సభలను పర్యవేక్షించారు.



కుంటాల: ఓలాలో అధికారులను నిలదీస్తున్న రైతులు

సోన్: మండలకేంద్రంతోపాటు న్యూవెల్మల్, లోకల్‌వెల్మల్, గంజాల్, కడ్తాల్, మాదాపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. కడ్తాల్‌లో మండల ప్రత్యేక అధికారి, జెడ్పీ సీఈవో గోవింద్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు ఎంపీవో కలీమ్ అహ్మద్ హాజరయ్యారు. న్యూవెల్మల్‌లో తహసీల్దార్ మల్లేశ్, గ్రామ ప్రత్యేకాధికారి రాజమల్లు, మాదాపూర్, లోకల్ వెల్మల్‌లో ఏవో వినోద్ కుమార్, గంజాల్‌లో జ్యోతి ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. అనర్హులను ఎంపిక చేశారని కడ్తాల్ గ్రామస్తులు అధికారులను నిలదీశారు. క్షేత్రస్థాయిలో అధికారులు సర్వే నిర్వహించకుండానే ఎంపిక ఎలా చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో అధికారులు సభ నిర్వహించకుండానే మధ్యలో వెనుదిరిగారు. విషయం తెలుసుకున్న సోన్ సీఐ నవీన్ కుమార్, ఎస్సై గోపి గ్రామానికి చేరుకుని వారికి నచ్చజెప్పారు. అనంతరం అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆర్ఐ రఫీక్, ఎంపీవో మంజుల పాల్గొన్నారు.

తానూరు: ఉమ్రి(కే), దాగాం, తొండాల, బామ్ని తదితర గ్రామాల్లో గ్రామసభ నిర్వహించారు. లబ్ధిదారుల వివరాలను అధికారులు చదవి వినిపించారు. ఎంపీడీవో అబ్దుల్ సమ్మద్, తహసీల్దార్ లింగంమూర్తి, ఎంపీవో నసిరొద్దీన్ పాల్గొన్నారు.

బాసర: కిర్గుల్ (కె), టాక్లి, లాబ్డి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించినట్లు ఎంపీడీవో అశోక్ కుమార్ తెలిపారు. అర్హుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారన్నారు. సావర్గం, కౌట, కిర్గుల్(బి) గ్రామాల్లో బుధవారం గ్రామసభలు ఉంటాయని ఎంపీడీవో పేర్కొన్నారు.

కుభీర్: రంజని తండా, రాంనాయక్ తండా, చొండి, అంతర్ని, మాలేగాంలో గ్రామసభలు నిర్వహించారు. పలుచోట్ల రేషన్ కార్డులు మంజూరు కాలేదని ప్రజలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్, ఏపీవో హరిలాల్, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: మాడేగాం, సిర్గాపూర్, మయాపూర్‌లో నిర్వహించిన గ్రామసభల్లో తహసీల్దార్ బి.స్వాతి, ఎంపీడీవో అరుణారాణి, ఎంపీవో గోవర్ధన్, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు. అధికారులు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మాడేగాంలో 32, సిర్గాపూర్‌లో 78, మాయాపూర్‌లో 33 దరఖాస్తులు వచ్చాయి.

కడెం: అర్హులందరికీ పథకాలు అందిస్తామని డీఆర్డీవో, మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి అన్నారు. పాండ్వపూర్‌లో నిర్వహించిన గ్రామసభకు ఆమె హాజరయ్యారు. జాబితాలో పేర్లు లేని వారు దరఖాస్తులు అందించాలన్నారు. తహసీల్దార్ సుజాతరెడ్డి, ఎంపీడీవో అరుణ, ఏవో దినేష్, ఏపీవో జయదేవ్, ఏపీఎం రాజారాం ఉన్నారు.

దస్తురాబాద్: రేవోజీపేట, మల్లాపూర్(గోండుగూడ), దేవునిగూడెంలో గ్రామసభలు నిర్వహించారు. దేవునిగూడెంలో డీఆర్డీవో విజయలక్ష్మి పాల్గొన్నారు. జాబితాలో పేర్లు లేని వారు దరఖాస్తులను కార్యదర్శికి అందించాలన్నారు. మండల ప్రత్యేక అధికారి రాజేశ్వర్‌గౌడ్, తహసీల్దార్ నవాజీసర్పరాజ్, ఎంపీడీవో రమేశ్, ఏఈవో తిరుపతి, కార్యదర్శులు గోవర్ధన్, రవీందర్, వంశీకృష్ణ, ఏపీఎం గంగాధర్ పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): నందన్, కుస్లి, బూరుగుపల్లి(జి), అర్లి(కే) గ్రామాల్లో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఎంపీడీవో పుష్పలత మాట్లాడుతూ పథకాలకు అర్హులను ఎంపికచేస్తామన్నారు. తహసీల్దార్ సోమ శ్రీనివాస్, ఎంపీవో తిరుపతి రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్, కృష్ణ, శివకుమార్ తదితరులు ఉన్నారు.

ముథోల్: ఎడ్‌బిడ్, బోరిగాం, ముద్గల్, మచ్కల్, గ్రామాల్లో జరిగిన గ్రామసభల్లో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో పాల్గొన్నారు. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఏపీవో శిరీష తదితరుల ఉన్నారు.



సోన్: కడ్తాల్‌లో పాల్గొన్న జెడ్పీ సీఈవో గోవింద్



తానూరు: ఉమ్రి(కే)లో పాల్గొన్న అధికారులు



కుభీర్: రాంనాయక్ తండాలో..



కడెం: పాండ్వపూర్‌లో మాట్లాడుతున్న డీఆర్డీవో విజయలక్ష్మి



ఖానాపూర్: దరఖాస్తులు స్వీకరిస్తూ..

గ్రామసభల్లో గందరగోళం

సారంగాపూర్: ఆలూరు, మలక్‌చించోలి, ధని, దుప్యాతండా, గోపాల్‌పేట్, హనుమాన్‌తండా, ఇప్పచెలిమ, జౌళి, కంకెట, లింగాపూర్, నాగాపూర్ పెండల్‌దరి, వైకుంఠాపూర్, వంజర్ గ్రామాల్లో గ్రామసభల్లో గందరగోళం పరిస్థితి నెలకొంది. పలుచోట్ల రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు అందించినా జాబితాలో రాలేదని ప్రజలు ఆందోళన చేపట్టారు. మలక్‌చించోలిలో ఆందోళనకు దిగారు. తహసీల్దార్ వచ్చే వరకు గ్రామసభ బహిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. అధికారులు తహసీల్దార్ శ్రీదేవికి వివరించడంతో ఆమె అక్కడికి చేరుకుని వారికి సర్ది చెప్పి గ్రామసభ కొనసాగించారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రావు, ఎంఈవో మధుసూదన్, ఏవో వాక్వార్ అహ్మద్, వెటర్నరీ డాక్టర్ నంద్‌కుమార్, పీఆర్ ఏఈ దేవిదాస్, ఎంపీవో అజీజ్‌ఖాన్, పీఆర్ డీఈ తుక్కారాం పాల్గొన్నారు.



మలక్‌చించోలిలో గ్రామసభ

భైంసాలో వార్డుసభలు

భైంసాటౌన్: పట్టణంలోని ఒకటి, రెండు, పదహారు వార్డులకు సంబంధించి కుంట ప్రాంతంలో, 4,6 వార్డులకు సంబంధించి ఏపీనగర్ హనుమాన్ మందిర్ ఆవరణలో వార్డుసభలు నిర్వహించారు. జాబితాలో పేర్లు లేనివారి నుంచి కొత్త రేషన్‌కార్డులు, మార్పులు, చేర్పులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించారు. కొత్తగా రేషన్‌కార్డుల కోసం 563, పేర్ల చేర్పు కోసం 450, ఇందిరమ్మ ఇళ్ల కోసం 28, రైతు భరోసా కోసం ఆరు దరఖాస్తులు వచ్చినట్లు మున్సిపల్ కమిషనర్ రాజేశ్‌కుమార్ తెలిపారు.



ఏపీనగర్‌లో సర్వే వివరాలు వెల్లడిస్తున్న కమిషనర్

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సోన్: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంతోపాటు మాదాపూర్, పాక్‌పట్ల, లోకల్‌వెల్మల్, ఓల్డ్ పోచంపాడు, గాంధీనగర్, సిద్దులకుంట, జాఫ్రపూరు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీల పనులు ప్రారంభించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో రూ.850 కోట్ల మేర అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతీ మారుమూల గ్రామాలకు రోడ్లు, తాగునీరు, సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయడం లేదన్నారు. మండల కేంద్రంలో కేజీబీవీ ప్రహరీ నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మున్నూరు కాపు, రజక సంఘ భవనాలు, ఎస్సీ, శ్మశాన వాటిక, ప్రహరీ, రోడ్డుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లేశ్, ఆర్ఐ అలీ మున్నీసా, ఏఈవో ఉమామహేశ్వరి, బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, రావుల రాంనాథ్, మెడిసెమ్మ రాజు, మండల అధ్యక్షుడు మార గంగారెడ్డి, జక్క రాజేశ్వర్, సరికెల గంగన్న, హరీష్ రెడ్డి నరేష్, ఉదయ్, గోవర్ధన్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఆంగ్లభాష నైపుణ్యాలు తప్పనిసరి

నిర్మల్ రూరల్: ప్రతీ విద్యార్థికి ఇంగ్లిష్ భాష నైపుణ్యాలు తప్పనిసరి అని, జిల్లాలో ఇంగ్లిష్ భాషాభివృద్ధికి ఎల్టా చేస్తున్న కృషి అభినందనీయమని డీఈవో రామారావు అన్నారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్(ఎల్టా)ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్ రాత పరీక్ష, ఉపన్యాస పోటీలు మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఈవో హాజరై జిల్లా పరీక్షల అధికారి పద్మ, కేజీబీవీ జిల్లా అధికారి సలోమి కరుణతో కలిసి పరీక్ష పత్రాలను ఆవిష్కరించారు. ఎల్టా జిల్లా శాఖ విద్యార్థులకు స్టడీ మెటీరియల్, ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఇవ్వడాన్ని ప్రశంసించారు. ఆంగ్లంపై పట్టు సాధిస్తే భవిష్యత్‌లో ఉన్నతస్థితికి ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జడ్జీలుగా జిల్లా అధ్యక్షుడు కడార్ల రవీంద్ర, అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.సుభాష్, డాక్టర్ అఖిలేష్‌కుమార్ సింగ్, గంగన్న డేవిడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూమన్న యాదవ్, సంధ్యారాణి, శైలజ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న డీఈవో

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కుంటాల: ఆంగ్ల ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో కుంటాల ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఎస్కే.మాహీజ్, విశాలి ఉపన్యాస పోటీల్లో వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 31న హైదరాబాద్‌లో నిర్వహించే /పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నారు.

గ్రామదేవతలకు బోనాలు

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామంలో గ్రామదేవతలకు గ్రామస్తులు మంగళవారం బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుల చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయం వద్ద సందడి నెలకొంది.



బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

చేనేత హస్తకళ మేళా ప్రారంభం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బాగులవాడలోని ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అఖిల భారత చేనేత హస్తకళ మేళాను మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ మంగళవారం ప్రారంభించారు. చేనేత హస్త కళాకారులు ఎంతో నైపుణ్యంతో తయారుచేసిన వస్త్రాలను ప్రజలందరూ కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలన్నారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

పెంబి ఎస్సైగా హన్మాండ్లు

పెంబి: పెంబి ఎస్సైగా ఎం.హన్మాండ్లు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌హెచ్‌వోగా పనిచేసిన హన్మాండ్లు నిర్మల్‌కు బదిలీపై వెళ్లారు. నిర్మల్ నుంచి ఎం.హన్మాండ్ల బదిలీపై ఇక్కడకు వచ్చి బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు.



ఎం.హన్మాండ్లు

దుస్తుల పంపిణీ

సారంగపూర్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అంగన్‌వాడీ టీచర్ వనజ దుస్తులు పంపిణీ చేశారు. గ్రామంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన 32 మందికి దుస్తులు అందజేశారు. ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సాయిరెడ్డి, ఉపాధ్యాయులు సుశీల తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

ఖానాపూర్: మండలంలోని బీర్నంది, కొలాంగూడ, చామన్‌పల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత మంగళవారం తనిఖీ చేశారు. రికార్డులతోపా టు కేంద్రాల ఆవరణల్లో కిచెన్ గార్డెన్లను పరిశీలించారు. పోషణ ట్రాకర్ యాప్‌లో లబ్ధిదారుల నమోదును ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. ఆరేళ్ల పిల్లలకు ఆటపాటలతో కూడిన బోధన చేయాలన్నారు.

మామిడి రైతులకు అవగాహన

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్‌లోని మామిడి తోటల్లోని రైతులకు ఉద్యాన, పట్టు పరిశ్రమశాఖ ఖానాపూర్ క్లస్టర్ అధికారి స్పందన మంగళవారం అవగాహన కల్పించారు. మామిడి పూత వచ్చినప్పటికీ బోరాన్ లోపం వల్ల ఫలదీకరణ సరిగ్గా జరగక పిందె కడుతుందన్నారు. పిందె కట్టు పెంచడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అధికారులు ఉన్నారు.

పాడి పరిశ్రమ లాభదాయకం

- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

దిలావర్‌పూర్: గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడిపశ్రమపై ఆసక్తి కనబరిస్తే లాభదాయకంగా ఉంటుందని అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ అన్నారు. మండలంలోని సముందర్‌పల్లి గ్రామంలో మంగళవారం విజయ డెయిరీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హారు. ఈసందర్భంగా స్థానిక పాడి రైతులకు సంబంధించి పశుపోషణ, పాల సేకరణ వంటివి పరిశీలించారు. రోజుకు 200 లీట్లకుపైగా పాలను సేకరిస్తున్న స్థానిక పాడిరైతులను, వెన్నుదన్నుగా ఉంటున్న విజయ డెయిరీని అభినందించారు. విజయ డెయిరీకి పాలు పోస్తున్న 60 మంది రైతులకు ప్రోత్సాహకంగా పాల క్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా పశువుల వైద్యానికి స్థానికంగా ఒక ట్రేవిస్‌తోపాటు గ్రామ పరిసరాల్లో నీటి తొట్ల నిర్మాణానికి నిధుల సమకూర్చాలని స్థానిక పాడి రైతులు కోరారు. కార్యక్రమంలో విజయ డెయిరీ డీడీ మధుసూదన్, మండల పశువైద్యాధికారి గోవర్ధన్, స్థానిక నాయకులు పీరాజీపాటిల్, భాగ్యారావు, నర్సారెడ్డి, తిరుపతిరెడ్డి, నిర్మల్ డెయిరీ ఇన్‌చార్జి సంతోష్, స్థానిక రైతులు, పాడి రైతులు పాల్గొన్నారు.



పాడి రైతులకు ప్రోత్సాహకంగా పాల క్యాన్‌లను అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

సంక్షిప్త వార్తలు

జీవన ఎరువుల వాడకంపై దృష్టి సారించాలి

దస్తురాబాద్: రైతులు జీవన ఎరువుల వాడకం పై దృష్టి సారించాలని ఏవో మానస పేర్కొన్నారు. జాతీయ ఆహార భద్రత మిషన్ పథకంలో భాగంగా మండల కేంద్రంలోని పంట పొలాల్లో మంగళవారం రైతులకు అవగహన కల్పించారు. అనంతరం రైతు వేదికలో వారికి ఎరువులు పంపిణీ చేశారు. ఏఈవో తిరుపతి, రైతులు పెద్దన్న, రమణ, రాజేందర్, గంగాధర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ముథోల్: మండల కేంద్రంలోని బస్వాగార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో పాఠశాలలు, కళాశాలకు చెందిన విద్యార్థులకు మంగళవారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు గంపా నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్ సోము, వాడేకర్ లక్ష్మణ్, చల్లా శ్రీధర్‌రెడ్డి, శ్రీధర్ వీరమళ్ల, శ్రీనివాస్ పెరుమాండ్ల, సతీశ్ తూము పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్సై

నిర్మల్‌టౌన్: మతిస్థిమితం లేని మహిళకు భరోసా ఇన్‌చార్జి మహిళా ఎస్సై సుమాంజలి మంగళవారం దుస్తులు అందించి మానవత్వం చాటుకుంది. నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌లో తిరుగుతున్న విషయం తెలుసుకున్న ఎస్సై అక్కడికి చేరుకుని మహిళకు దుస్తులు అందించారు. అనంతరం ఆమెను సఖీ సెంటర్‌కు అప్పగించారు. ఎస్సై సుమాంజలిని ఎస్పీ జానకీ షర్మిల అభినందించారు.